AP 4PG 10 - 4- 2026 FRRIDAYqxp_Layout 1 10-04-2026 09:49 AM Page 2



## రిజిస్ట్రేషన్ సేవలపై సదస్సు



యాడికి, ఏప్రిల్ 9 (అనంత ప్రభ )

సమాచార హక్కు చట్టం 2025 నేపథ్యంలో రిజిస్ట్రేషన్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌రిజిస్ట్రార్ షేక్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్న రిజిస్ట్రేషన్ సేవలను వివరించారు. పబ్లిక్ డేటా ఎంట్రీ, స్లాట్ బుకింగ్ తదితర సేవలను త్వరితగతిన వినియోగించుకునే విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, ఈ వ్యవస్థ వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సులభతరం చేయడమే లక్ష్యమని తెలిపారు. సదస్సుకు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్స్, ప్రజలు హాజరై సేవలపై అవగాహన పొందారు


## కనగానపల్లి లో మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



కనగానపల్ల ,ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండల గ్రామానికి చెందిన తలారి ఓబులపతి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రోజున మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురువారం రోజున కనగానపల్లి గ్రామానికి వెళ్లి తలారి ఓబులపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కనగానపల్లి మండలం కొండ్రెడ్డి బావి గ్రామానికి చెందిన రంగారెడ్డి కుమారుడు మధుసూదన్ రెడ్డి నిన్నటి రోజున మృతి చెందాడు. గురువారం కొండ్రెడ్డి బావి గ్రామానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు

## మాజీ సర్పంచ్ ధనుంజయ్య సన్మానం కార్యక్రమం



కూడేరు, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామ మాజీ సర్పంచ్ ధనుంజయ సన్మాన కార్యక్రమాన్ని గురువారం రోజున పంచాయతీ కార్యాలయం నందు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో శాలవాన కప్పి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాపై ఉన్న నమ్మకంతో నాకు సర్పంచ్ అవకాశాన్ని కల్పించిన నాటి నుండి నేటి వరకు ఐదు సంవత్సరాల కాలం పాటు స్వార్థం లేని సేవలతో గ్రామ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసేమని ఐదు సంవత్సరాల కాలం పాటు నా వెంటే నడిచి నాకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ పదవీకాలం ముగియడంతో నేటి నుండి సర్వాధికారాలు లేనప్పటికీ గ్రామ ప్రజల సహకారంతో భవిష్యత్తులో ప్రజా సేవ చేసేందుకు అన్ని విధాల ముందే ఉంటునని గ్రామ ప్రజలకు ప్రేమాభిమానాలు ఎన్నటికీ మరువలేని మాజీ సర్పంచ్ ధనంజయ అన్నారు

## సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్ రూఫ్ ఏర్పాటు చేయాలి




ఆదోని, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

పట్టణంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్‌తో రూఫ్‌లు ఏర్పాటు చేయాలని రాఖీ× నాయకులు మున్సిపల్ కమిషనర్ నహీమ్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆదోనిలో ఎండలు తీవ్రంగా నమోదవుతున్నాయని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హీట్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వాహనదారులకు ఉపశమనం కల్పించే విధంగా నగరంలోని ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్ రూఫ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కర్నూల్‌లో ఇటువంటి ఏర్పాట్లు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా, ఎండల కారణంగా ప్రజలు, ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బస్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు

## విద్యా సేవకు నిలువెత్తు నిదర్శనం ఫాదర్ ఫెర్రర్



యాడికి, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

పేద మరియు బలహీన వర్గాల అభ్యున్నతిని జీవిత లక్ష్యంగా ఎంచుకుని కృషి చేసిన స్పానిష్ మానవతావాది ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది పాఠశాల సమీపంలోని ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గతంలో మా పాఠశాలకు యాడికిలోని పేద పిల్లల విద్యాభివృద్ధి కోసం ఫాదర్ ఫెర్రర్ సహకారంతో 57 లక్షల రూపాయలు మంజూరై అదనపు తరగతి గదులు నిర్మించబడ్డాయని, ఆయన సహాయంతో ఈరోజు విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకుంటున్నారు అని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన ఫెర్రర్, పేద విద్యార్థుల కోసం అనేక ఉచిత పాఠశాలలు నిర్వహించడమే కాకుండా ఉచిత భోజనం, పుస్తకాలు, దుస్తులు అందజేసి ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడా విద్యను చేరవేసిన మహనీయుడని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం స్వర్ణ గంగ మరియు రవికుమార్ కొనియాడారు. అతను ఒక వ్యక్తి కాదు శక్తి అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారిస్, రాజు, జయలక్ష్మి, శ్రీదేవి, లక్ష్మీకాంతం, శివ, చంద్రకళ, మంజులవాణి, ఫరీదా, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు

## యాడికి పీహెచ్‌సీలో పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమము





యాడికి, ఏప్రిల్ 9 (అనంత ప్రభ )

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పరమేశ్వర్ మరియు డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో హై రిస్క్ గర్భిణులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొని గర్భవతులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. వేసవి తీవ్రత దృష్ట్యా గర్భిణులు అనవసర ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తపడాలని, వడదెబ్బ నుండి రక్షించుకునే సూచనలను అందించారు. అలాగే గర్భిణులు ఈ డి డి కి ఒక వారం ముందు ప్రభుత్వ ఆసుపత్రులకు 108 అంబులెన్స్ ద్వారా చేరాలని, కాన్పులకు వెళ్లేటప్పుడు తమ ఆశా కార్యకర్తలను తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య రక్షణలో పౌష్టికాహార ప్రాముఖ్యతను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సి. హెచ్. ఓ జుబేదా, పి హెచ్ ఎన్ శోభకుమారి, మేల్ సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, మేల్ హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆదోనిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం



ఆదోని, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జి వై సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజానికి చెడు సందేశాన్ని పంపుతున్నాయని, ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలనైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

అలాగే రాష్ట్ర రాజధాని అంశంపై ఆయన మాట్లాడుతూ, అమరావతి పేరుతో కొందరు రాజకీయ నాయకులు స్వప్రయోజనాల కోసం వ్యవహరించారని ఆరోపించారు. రాజధాని ప్రకటనకు ముందుగానే భూములు కొనుగోలు చేసి లాభాలు పొందేలా ప్రణాళికలు రూపొందించారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసే విధంగా రాజధాని నిర్మాణం చేయడం కంటే, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను వినియోగించుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక పాల్గొన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆదోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏబీఎన్ రాధాకృష్ణపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు

## తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి..ఎమ్మెల్యే అమిలినేని



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, అది కూడా ఎక్కడా ఏ ఒక్క నాయకుల పేర్లు పెట్టకుండా ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ అందుస్తున్నారని అన్నారు..నేడు కళ్యాణదుర్గం పట్టణంలో బ్రెయినీ స్టార్ ప్రయివేట్ పాఠశాల నూతన భవనాన్ని పాఠశాల యాజమాన్యంతో కలసి రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు ప్రారంభించారు.. పాఠశాల గదులను, చిన్నారులకు ఆటల గది, సైన్స్ గది, ఇతర గదులను పరిశీలించారు..అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ నా చిన్నప్పుడు నిర్మల కాన్వెంట్ లో విద్యను ప్రారంభించి, అక్కడ నేర్చుకున్న ఇంగ్లీష్ బేసిక్ ఇప్పుడు ఉపయోగపడుతోందని, అలాగే ప్రతి తల్లిదండ్రులు కూడా వారి చిన్నారుల పట్ల జాగ్రత్త వహించి ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడాలని అన్నారు..ఉన్నత చదువు, సంస్కారం రెండు ఉన్నప్పుడే మంచి ఉన్నత స్థాయికి ఎదుగుతారని, మనం చదువుకునే చదవుతో ఏ దేశంలోనైనా రానించవచ్చని అన్నారు.. ఒక చిన్న పాఠశాలగా 25 మందితో ప్రారంభించి నేడు ఇంత పెద్ద భవంతిలోకి రావడం అది కూడా 250 మంది విద్యార్థులతో పాఠశాల నడుస్తుండటం గొప్ప విషయం ఇందుకు యాజమాన్యం కృషి అమోఘమన్నారు..మన వెనుకబడిన ప్రాంతంలో విద్యపై ఉన్న మక్కువ చాలా ఎక్కువని, అంతేకాకుండా ఇక్కడ ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి 1200 మందికి పైగా శిక్షణ తీసుకుని అందులో కూడా 88 మంది ఉపాధ్యాయులుగా నియమితులు అయ్యారు అంటే అర్థం చేసుకోవాలని, గ్రామాల్లో చాలా చోట్ల పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయి వాటి గురించి ఒక్క మెసేజ్ చేస్తే చాలు స్పందించి వాటికి రిప్లే ఇవ్వడమే కాకుండా సమస్య పారష్కరించే బాధ్యతను నారా లోకేష్ గారు తీసుకుంటున్నారు..రోడ్లు బాగోలేక చాలా గ్రామాలకు బస్సులు కూడా వెళ్లడం లేదు విద్యార్థులు, నడుచుకుంటూ, కొందరు సైకిళ్లలో వెళ్లి చదువుకుంటున్నారు. ఇదే విషయాన్ని రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళాం త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారన్నారు..అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించింది..కార్యక్రంలో పాఠశాల యాజమాన్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శింగనమల మండల కేంద్రంలో డాక్టర్ విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలు



శింగనమల, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

శింగనమల మండల కేంద్రంలో డాక్టర్ విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ 106వ జయంతి సందర్భంగా సింగనమల మండల కేంద్రంలో. మంచో ఫెర్రర్ మండలసమఖ్య దివ్యాంగులకు. ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణస్వామి. ముత్యాలు. ఆదినారాయణ. నారాయణ. మసూద్ వలి. మల్లయ్య. శిరీష. ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్న జలాపురం ఓబులేసు. హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమఖ్య సభ్యులు గ్రామ సంఘ సభ్యులు మరియు పిల్లలు పాల్గొనడం జరిగింది.

## ఏబీఎన్ రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలి అంటూ ఫిర్యాదు చేసిన లీగల్ సెల్ నాయకులు..



అనంతపురం, ఏప్రిల్ 9 (అనంత ప్రభ )

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ తన కొత్త పలుకు శీర్షికలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిని, పార్టీని మరియు ముఖ్యంగా పార్టీ నాయకుల కుటుంబ సభ్యులను (భార్యలను) ఉద్దేశించి అత్యంత నీచమైన, నికృష్టమైన భాషతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైయస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏబీఎన్ రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలి అంటూ ఫిర్యాదు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యసమాజం తల దించుకునేలా మహిళలను కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. ఇలాంటి సంస్కారహీనులకు కూటమి నాయకులు అండగా నిలవడం చూస్తే రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు ఉమాపతి, నాగన్న, శ్రీనివాస్ రెడ్డి, వెంకటరాముడు, నారాయణరెడ్డి, హబీబుల్లా, పురుషోత్తం, శైలజాబాను, కవిత, అరుణ, చంద్రారెడ్డి, మల్లికార్జున, లక్ష్మీకాంత్, జీఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన పుల్లెల గోపిచంద్



అనంతపురం, ఏప్రిల్ 9 (అనంత ప్రభ )

భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపిచంద్ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఎమ్మెల్యే సునీతకు గోపిచంద్ కనిపించారు. దీంతో ఆయన వెంటనే ఎమ్మెల్యే సునీత వద్దకు వచ్చి ఆప్యాయంగా పలుకరించారు. గతంలో కలిసిన పలు సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే సునీతతో తిరుపతిలో పని చేసే అనంతపురం జిల్లాకు చెందిన పలువురు పోలీస్ అధికారులు కలిశారు. సీఐ, ఎస్ఐలు కలవగా వారిని ఆప్యాయంగా పలుకరించారు

## రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు ఆదోని పరిధిలో 12 స్పీడ్ స్టాపర్ల ఏర్పాటు




ఆదోని, ఏప్రిల్ 9 (అనంత ప్రభ)

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదోని రూరల్ సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఈస్వీ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేష్ కుమార్ సిబ్బందితో కలిసి ఆదోని ఆలూరు, సిరిగుప్ప రహదారులపై వాహనాల వేగ నియంత్రణకు మొత్తం 12 స్పీడ్ స్టాపర్లు ఏర్పాటు చేశారు. ధనపురం, నారాయణపురం, సంతకుళ్లూరు గ్రామాల సమీప రోడ్ల వద్ద ఈ స్టాపర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా గ్రామాల వద్ద వాహనాల వేగం తగ్గి రోడ్డు ప్రమాదాలునివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి రోడ్డు భద్రతకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు